క్లుప్తంగా

స్వప్నకు వైద్యరత్న అవార్డు


అవార్డు అందుకున్న స్వప్న

నాంపల్లి: ఖమ్మం ఖనాపూర్‌కు చెందిన, హవేలిలో కోమలి వెల్నెస్ సెంటర్ నడిపిస్తూ కీళ్ళ నొప్పులకు, మోకాళ్ల నొప్పులకు ఇతర దీర్ఘకాలిక మొండి వ్యాధులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ఎం.స్వప్నకు అరుదైన గౌరవం దక్కింది. వరల్డ్ హెల్త్ డేను పురస్కరించుకుని హైదరాబాదులోని తెలుగు వర్సిటీలో పబ్లిక్ హెల్త్‌కేర్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య రత్న అవార్డుల ప్రదానోత్సవ సభలో ఆమె అవార్డును అందుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. దీర్ఘకాలిక మొండి వ్యాధులకు వైద్యం అందిస్తున్న తనకు ఈ అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

అన్నదానం



నాంపల్లి: నిలోఫర్ వద్ద రెడీ టు సర్వ్ ఫౌండేషన్, సాయి అన్నపూర్ణ ట్రస్ట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రోగులు, రోగి సహాయకులు అన్నదానం చేపట్టారు. సినీ నటులు షాదన్ పవన్, మిస్ ఇండియా ప్రింట్ కల అతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. అన్ని దానాల కంటే అన్నదానం ఎంతో గొప్పదని చెప్పారు. సంస్థ వ్యవస్థాపకులు పెద్ది శంకర్ మాట్లాడుతూ.. పదేళ్లుగా అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రతి ఆదివారం ఒక్కో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తూ అభాగ్యులకు ఆసరాగా నిలుస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ సంస్థ కో ఆర్డినేటర్ ప్రకాష్ ప్రశాంత్, నవీన్, బీటీ నాయుడు, రాజు, ప్రశాంత్, జయంత్, నరేంద్ర వర్మ, నితిన్ పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు



గౌలిపురం: భాగ్యనగర్ జిల్లా యువ మోర్చా ఆధ్వర్యంలో హనుమాన్‌నగర్ బస్తీలో భారతీయ జనతా యువమోర్చా సేవా సామాజిక న్యాయ వారోత్సవాలలో భాగంగా భ్యానగర్ జిల్లా అధ్యక్షుడు శివచంద్రగిరి ఆధ్వర్యంలో సేవా బస్తీ, సహపంక్తి భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సమ్మిరెడ్డి సురేందర్‌రెడ్డి, గౌలిపుర కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, అధికార ప్రతినిధి వీరేందర్‌యాదవ్, ధీరజ్, రఘుకాంత్, భరత్‌కుమార్, జగన్ మోహన్, సచిన్, మహేష్, దీపక్, రేణుక, నళిని, అనిత తదితరులు పాల్గొన్నారు.

నటన శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ థియేటర్ మీడియా రిపార్టరి ఆధ్వర్యంలో 45 రోజుల పాటు చిన్నారులకు నటన శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సంస్థ వ్యవస్థాపకులు ప్రమేష్‌గౌడ్‌తో కలిసి శిక్షణా శిబిరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. 45 రోజుల పాటు ఉండే శిక్షణా శిబిరాన్ని చిన్నా రులు వినియోగించుకోవాలన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు రమేష్ మాట్లాడుతూ.. శిక్షణా శిబిరంలో పాల్గొనదలచిన వారు 12వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 73968 17623 లలో సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం


ఆశీష్‌కుమార్‌యాదవ్‌ను సత్కరించిన పలువురు వ్యాపారులు, నాయకులు

అబిడ్స్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి, ప్రగతికి బీఆర్‌ఎస్ పార్టీ ముందుంటుందన్నారు. ఆదివారం అబిడ్స్ స్టేషన్ రోడ్డులో పలువురు వ్యాపారులు, స్థానిక నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆశీష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతానన్నారు. తన జన్మదిన సందర్భంగా పలు స్వచ్ఛంద సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

వాహనాలకు చోటేది..
నడకకు దారేది..?

- నడిరోడ్డుపై వ్యాపారాలు.. ముందుకు సాగని వాహనాలు
- రంజాన్ ముగిసేంత వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- మదీనా సర్కిల్ నుంచి ట్రాఫిక్ దారి మళ్లించే ఏర్పాట్లు
- చార్మినార్ అవుటర్ రింగ్ రోడ్డుపై మాత్రమే వాహనాలకు అనుమతిపై సమాలోచన


ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో నడిరోడ్డుపైనే వాహనాల మధ్య నుంచి వెళ్తున్న పర్యాటకులు

చార్మినార్: చార్మినార్ ప్రధాన రోడ్డులో రంజాన్ మార్కెట్ జోరుగా కొనసాగుతోంది. కాలు తీసి కాలు పెట్టలేని జనం. అసలే ఇరుకు రోడ్లు.. ఆపై అదే రోడ్డుపై నుంచి సందర్శకులు, వినియోగదారులతో పాటు వాహనాల రాకపోకలు.. ఎలా సాధ్యమవుతుంది. అందుకే ఎక్కడి వాహనాలు అక్కడే రోడ్డుపై ఉంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఉన్నప్పటికీ.. వందలాది వాహనాలు చార్మినార్ వైపు వస్తుండడంతో ఏమి చేయలేని పరిస్థితి. రంజాన్ మార్కెట్‌లో సాధారణంగా ప్రతిరోజూ వినియోగదారుల సందడి అధికంగా ఉంటుంది. దీనికి తోడు సెలవులు, వీకెండ్ రోజులలో ఇసుక పోస్తే.. రాలనంత జన సందోహం.

తెలియక వస్తే.. ఆగమాగం..

నగరంలోని ఇతర ప్రాంతాలకు చెందిన వారు తమ వాహనాలతో చార్మినార్‌కు రావడానికి ప్రయత్నిస్తే.. ఆగమాగమవుతారు. మదీనా వరకు సాఫీగా వచ్చే వాహనదారులు ఆ తర్వాత ట్రాఫిక్‌లో ఇరుక్కోక తప్పదు. ప్రత్యామ్నాయ మార్గాల్లో రావాల్సి ఉంటుంది. ఇప్పటికే దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో చార్మినార్ అవుటర్ రింగ్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో ఉచితంగా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసినప్పటికీ.. తెలియని చాలా మంది వాహనదారులు నేరుగా చార్మినార్–గుల్జార్‌హౌజ్ పరిసరాలకు చేరుకుని తమ వాహనాలను ఎక్కడ పార్క్ చేయాలో తెలియక తికమక పడుతున్నారు.

కనిపించని ఫుట్‌పాత్‌లు..

వాస్తవానికి మదీనా సర్కిల్ నుంచి గుల్జార్ హౌజ్ వరకు ఫుట్‌పాత్‌లు కనిపించవు. ఒక వేళ అక్కడక్కడ ఉన్నా.. అవి ప్రస్తుతం కనుమరుగయ్యాయి. దీంతో ప్రజలు నడి రోడ్డు మీదనుంచే ముందుకు వెళ్లాల్సి ఉంది. ఎప్పుడు.. ఎక్కడి నుంచి ఏ వాహనం వచ్చి ఢీ కొంటుందోననే భయాందోళనల నడుమ బిక్కు బిక్కు మంటూ పర్యాటకులు, పాదచారులు ముందుకు వెళుతుంటారు. సాధారణ రోజుల్లోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే.. ఇక రంజాన్ మార్కెట్ సందర్భంగా ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

నడిరోడ్డుపై వ్యాపారాలు..

ఫుట్‌పాతులే కాదు.. రోడ్లు సైతం ఆక్రమించుకొని నడిరోడ్డుపై వ్యాపారాలు కొనసాగుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామగ్రి.. ఒక్కటేమిటి రంజాన్ మార్కెట్ సందర్భంగా సర్వమూ రోడ్లపైనే అమ్మకానికి ఉంటాయి. వాహనాల పార్కింగ్ కూడా నడిరోడ్డు పైనే!. ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించడమే కాకుండా నడిరోడ్డుపై చిరువ్యాపారాలు కొనసాగుతున్నాయి.

వాహనాలను మదీనా వరకే అనుమతిస్తే..

రంజాన్ మార్కెట్ సందర్భంగా గుల్జార్‌హౌజ్–చార్మినార్ వైపు వచ్చే వాహనాలను రద్దీ సమయాల్లో కేవలం మదీనా సర్కిల్ వరకు మాత్రమే అనుమతించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ముందుకు పంపిస్తే.. ఆశించిన ఫలితాలుంటాయని వాహనదారులు అంటున్నారు. వాహనాలకు అనుమతి ఉన్నందును తెలియని వారు ముందుకు వెళ్తూ ట్రాఫిక్ జాంలో ఇరుక్కుంటున్నారని.. అందుకే ప్రత్యామ్నాయ మార్గాలలో వాహనాలను అనుమతించాలని అంటున్నారు. చార్మినార్ అవుటర్ రింగ్ రోడ్డు ద్వారా వాహనాలను అనుమతించే విషయంపై దక్షిణ మండలం ట్రాఫిక్ పోలీసులు సమాలోచన చేస్తున్నారు.

21న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత సభ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరు నామకరణం చేసినందుకుగాను ఈనెల 21న రవీంద్రభారతిలో కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ నరేందర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కృతజ్ఞత సభ వాల్‌పోస్టర్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. 21న జరిగే సభకు పలువురు రాష్ట్ర మంత్రులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలువురు మంత్రులు హాజరవుతున్నారని, వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్టు ఉప్పు సత్యనారాణ, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి


మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకిమేరాజ్ కాలనీలోని తన కార్యాలయం వద్ద వివిధ డివిజన్‌లకు చెందిన మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే వర్షాకాలంలో కార్వాన్ నియోజకవర్గంలో ముంపు బస్తీలు ఒక్కటి కూడా ఉండవన్నారు. బస్తీలు, కాలనీలకు ముప్పు ప్రమాదం తప్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ముఖ్యంగా టోలిచౌకి, గోల్కొండ, లంగర్‌హౌస్ డివిజన్‌లలోని లోతట్టు ప్రాంతాలు గతంలో వర్షాలకు ముంపునకు గురయ్యేవన్నారు. ఆ ప్రాంతాల్లో భారీ వరదనీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని, వేసవి కాలం పూర్తయ్యే వరకు ఈ పనులు పూర్తవుతాయని ఆయన తెలిపారు. అదే విధంగా నానల్‌నగర్ డివిజన్‌లోని నిజాం కాలనీ, అల్ హస్నాత్ కాలనీలలో సైతం కోట్లాది రూపాయలతో బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయన్నారు. దీనికి తోడుగా టోలిచౌకి పరిసర ప్రాంతాలను ముంపునకు గురి చేస్తున్న హకీంపేట్‌లోని రక్షణశాఖ స్థలంలో ఉన్న బుల్కాపూర్ నాలను దారి మళ్లించడం జరుగుతుందని, త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని ఆయన అన్నారు. దీనివల్ల నానల్‌నగర్ డివిజన్‌లోని ఎన్నో బస్తీలకు ముంపు ప్రమాదం శాశ్వతంగా తప్పిపోతుందని ఆయన అన్నారు. అదే విధంగా టోలిచౌకి డివిజన్‌లోని శాతం తలాబ్ నిండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని, దీని నుంచి వరదనీరు ఎప్పటికప్పుడు ఖాళీ చేసేందుకు తూమును ఆధునీకరించడం జరిగిందన్నారు. దీనివల్ల నదీమ్ కాలనీ, విరాసత్ కాలనీలకు ముంపు పెట్టు తప్పిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, షేక్ అబ్దుల్లా, హబీబ్ చావూస్, సయ్యద్ జబ్బార్ తదితరులున్నారు.

ఘనంగా ఉస్మానియా డెంటల్ కాలేజీ స్నాతకోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా డెంటల్ కాలేజీ-2017 బీడీఎస్ బ్యాచ్ స్నాతకోత్సవం ఆదివారం సందడిగా జరిగింది. హైదరాబాద్ గుడిమల్కాపూర్ కింగ్స్ కోహినూర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రమేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 71 మంది డెంటల్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. వ్యక్తిగత ఆరోగ్యానికి నోరే దర్పణం అయినా, మన దేశంలో ఇంకా డెంటల్ కేర్‌పై అవగాహన తక్కువగానే ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ విషయంలో మరింత అప్రమత్తత పెరిగే కొద్దీ డెంటిస్టులకు అవకాశాలు పెరుగుతాయని ఆయన వివరించారు.

యువత క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులకు మెడల్స్ అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ

జియాగూడ: యువత క్రీడల్లో రాణించాలని జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడ గౌతమ్‌మోడల్స్ స్కూల్‌లో మిత్ర అసోసియేట్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా వికాస్ అవార్డ్స్-2023 ద్వారా ఇంటర్ డో జాంగ్ త్రైకాండో చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఇంటర్నేషనల్ ప్లేయర్, నేషనల్ రిఫరి మంగి కిశోర్‌కుమార్, త్రైకాండో గ్రాండ్‌మాస్టర్ సంపూర్ణం పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, షీల్డ్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం మిత్రకృష్ణ మాట్లాడుతూ.. ఈనెల 16న జియాగూడ ఎస్‌బీఏ గార్డెన్‌లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యావికాస్ అవార్డులను బహూకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నరహరిచారి, ముఖేష్ జోగి, కేశవ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపుర: ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపుర డివిజన్‌లోని ఓంకార్ ప్లే గ్రౌండ్‌లో కేంద్ర మాజీ మంత్రి ఆలె నరేంద్ర 9వ వర్ధంతిని పురస్కరించుకొని ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. నరేంద్ర పాతబస్తీ అభ్యున్నతి కోసం నిరతరం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేందర్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ వెంకటేష్, ఆలె భాస్కర్‌రాజ్, ఎస్.సురేందర్‌రెడ్డి, ఆలె జితేందర్, మహేష్, రూప్‌రాజ్, వెంకటేష్, చంద్రశేఖర్, ధీరజ్‌లాల్, జ్యోతికుమార్, యాదగిరి, రఘుకాంత్, అశోక్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఆలె నరేంద్ర జీవితం నేటి తరానికి ఆదర్శం


గౌలిపుర చౌరస్తాలో నివాళులర్పిస్తున్న నాయకులు

గౌలిపుర: గౌలిపుర చౌరస్తాలో కేంద్ర మాజీ మంత్రి ఆలె నరేంద్ర 9వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గౌలిపుర డివిజన్ అధ్యక్షుడు రఘుకాంత్ ఆధ్వర్యంలో ఆయన వర్ధంతిని చేపట్టారు. ముఖ్యఅతితిగా బీజేపీ సీనియర్ నాయకుడు ఆధర్ల మహేష్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలె నరేంద్ర జీవితం నేటి తరానికి, కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో గౌలిపురం కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి, ఆలే జితేందర్, రూపురాజ్, చంద్రశేఖర్, ధీరజ్‌లాల్, వెంకటేష్, రేణుక, భానుప్రకాష్, అశోక్, యాదగిరి, సాయిసందీప్, వెంకటేష్, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కలిసికట్టుగా కృషి చేద్దాం


మాట్లాడుతున్న నందకిశోర్ వ్యాస్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో అందరూ కలిసికట్టుగా ఉండి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ అన్నారు. నూతనంగా ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా గోషామహల్ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నందకిశోర్‌వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు ఎలాంటి విభేదాలు లేకుండా పార్టీ ఐక్యత కోసం ప్రజా సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ఆరు డివిజన్లలో త్వరలోనే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేమేన కార్యక్రమాలు పూర్తి చేస్తామన్నారు. అందరూ ఐక్యమత్యంగా ఉంటేనే విజయం సాధ్యమన్నారు. బీజేపీని చిత్తుగా ఓడించేందుకు ప్రతి కార్యకర్త నడుంబిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పరమేశ్వరీ సింగ్, పురుషోత్తమ్‌రావు, సంతోష్ గుప్తా, ధన్‌రాజ్, సంతోషి, అనిత, పూజావ్యాస్ బిలాల్ పాల్గొన్నారు.

హోం మంత్రికి సత్కారం


హోంమంత్రిని సన్మానిస్తున్న లక్ష్మణ్‌రావు, గోపీగౌడ్

చార్మినార్: ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా పురానాపూల్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పెండ్యాల లక్ష్మణ్‌రావుతో పాటు చార్మినార్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు గోపీగౌడ్ తదితరులు ఆదివారం హోం శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీని కలిసి సత్కరించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు పుస్తే శ్రీకాంత్ పర్యవేక్షణలో ఇప్పటికే తమ తమ డివిజన్లలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించినట్లు వారు మంత్రికి వివరించారు.

గోషామహల్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌గా నందకిశోర్ వ్యాస్



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ బిలాల్ నియమితులయ్యారు. ఆదివారం సీఎం కేసీఆర్ గోషామహల్ నియోజకవర్గానికి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా బిలాల్ మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా బీఆర్‌ఎస్‌ను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతామన్నారు. రాబోయే ఎన్నికల్లో గోషామహల్ బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తామన్నారు. తనపై నమ్మకంతో ఇన్‌చార్జ్‌గా నియమించిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, నగర బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ దాసోజీ శ్రవణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇఫ్తార్ విందు


ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి ఖర్జూరం తినిపిస్తున్న డీసీపీ సాయి చైతన్య

చార్మినార్: దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో చార్మినార్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం రాత్రి చార్మినార్ కట్టడం వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మజ్లిస్ పార్టీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు. దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ముఖ్యఅతిథిగా హాజరై అక్బరుద్దీన్ ఒవైసీకి ఖర్జూరం తినిపించి రోజా విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ హాఫందీ, పత్తర్‌గట్టి కార్పొరేటర్ సొహేల్ ఖాద్రీ, చార్మినార్ లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ గురునాయుడు, చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండలో..

గోల్కొండ: గోల్కొండ సాత్ గల్లీలో ఆదివారం ఇఫ్తార్ విందు జరిగింది. సీనియర్ మజ్లిస్ నాయకులు, ప్రముఖ న్యాయవాది మీర్జా ఎక్బాల్ అహ్మద్ ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ విందులో గోల్కొండ, లంగర్‌హౌస్ డివిజన్‌లకు చెందిన పలువురు సీనియర్ మజ్లిస్ నాయకులతో పాటు వివిధ బస్తీలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులైన ఎంఏ బేగ్, వజాహత్, మహ్మద్ ముస్తఫా పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి పట్ల మక్కువ పెంచాలి


నృత్య గురువులను సన్మానిస్తున్న దామోధర్‌గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: భారతీయ సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కె.దామోదర్ గుప్తా అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్ అకాడమీ 10వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువతరానికి శాస్త్రీయ సంగీత కళల పట్ల మక్కువ కలిగించాలన్నారు. ఇందుకోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాల స్థాయి నుంచే వారికి శిక్షణను ఇప్పించాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీ నటుడు శివారెడ్డి, భారత ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపకులు రమణరావు, ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లలితరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం


ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్, నందకిశోర్‌వ్యాస్ బిలాల్, సంతోష్‌గుప్తా

అబిడ్స్: అన్ని వర్గాలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు నందకిశోర్ వ్యాస్ బిలాల్‌లు పేర్కొన్నారు. భగవాన్‌దాస్ బాడలో జరిగిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొని ప్రసంగించారు. కులమతాలకు అతీతంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల పండగలను స్వయంగా చేపట్టడం దేశంలోనే రికార్డు అన్నారు. పార్టీ చేపడుతున్న పలు సంక్షేమ పథకాలు కూడా ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీనివాస్‌యాదవ్, ధన్‌రాజ్, సంతోష్‌గుప్తా, జయశంకర్, శంకర్, సతీష్ పాల్గొన్నారు.

ఎన్‌ఐఎస్‌సీ ప్రైవేటీకరణను ఆపాలి



గోల్కొండ: నగర్‌నాగ్ ఇస్పాత్ ప్రాజెక్ట్ ప్రైవేటీకరణను ఆపాలని మాసబ్‌ట్యాంక్ ఎన్ఎండీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయ్ వెల్ఫేర్ ఫెడరేషన్ వారు ఆదివారం కేంద్రమంత్రి పగ్గన్ సింగ్ కులస్తేకు వినతిపత్రం అందజేశారు. ఎన్ఐఎస్‌సీ ప్రాజెక్టు కోసం ఆ ప్రాంత గిరిజనులు తమ భూములను విశాల దృక్పథంతో ప్రాజెక్టు కోసం ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం భూములు ఇచ్చిన వారికి శాశ్వత ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. తమకు జీవనాధారమైన భూములను ప్రాజెక్టు కోసం ఇచ్చిన వారికి కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం నిజంగా విస్మయం కలిగించిందని వారు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. స్థానిక గిరిజనులలో తమ కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం వస్తుందన్న ఆశతో ఎన్నో గిరిజన కుటుంబాలు ఎదురు చూస్తున్నాయని, ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఎస్‌సీను ప్రైవేటీకరణ చేయడం సముచితం కాదని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. హన్మంతరావు, పవన్ కుమార్, కుమార్ వయాని తదితరులున్నారు.

షేక్‌పేట్‌లో కార్పొరేటర్ పర్యటన

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లోని పలు కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయిస్తానని షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన డివిజన్ పరిధిలోని గల్షన్ కాలనీ, మినీ గుల్షన్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో అభివృద్ధి పనుల నిధుల కోసం వివిధ శాఖల అధికారులను కలుస్తూ వారికి సమస్యలను వివరిస్తున్నారని ఆయన అన్నారు. షేక్‌పేట్‌లో డ్రైనేజీ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి మల్లయ్య కృషి మరువలేనిది


సంస్మరణ సభలో మాట్లాడుతున్న దేవేందర్‌గౌడ్

సుల్తాన్‌బజార్: మత్స్యకారుల జీవన స్థితిగతులు మెరుగుపరిచేందుకు రాజీలేని పోరాటం చేసిన యోధుడు మల్లయ్య అని రాష్ట్ర మాజీ మంత్రి మాజీ పార్లమెంట్ సభ్యులు టి.దేవేందర్‌గౌడ్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మత్స్య సహకార సంఘాల సభకు మాజీ చైర్మన్ రాష్ట్ర బీసీ సంఘాల ఉపాధ్యక్షుడు ఎ.ఎల్.మల్లయ్య సంస్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బొగ్గులకుంటలోని వెనుకబడిన తరగతుల సాధికారత భవన్‌లో ఆదివారం ఎంఎల్.మల్లయ్య సంస్మరణ సభ జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వ్యక్తులు మాట్లాడుతూ.. మత్స్యకారుల జాతికి విశేషంగా కృషి చేశారన్నారు. ఎ.ఎల్.మల్లయ్య అకాల మృతి దేశంలోని మత్స్యకారులందరికీ తీరనిలోటని వారు తెలిపారు. బీసీల అభ్యున్నతికి ఆయన ఎంతగానో చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రమాదవశాత్తు చేపల వేటలో చనిపోయిన మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఇన్సూరెన్స్ ఇచ్చే సదుపాయాన్ని ఆయన కృషి ఫలితంగా నేడు మత్స్యకారులు పొందుతున్నారన్నారు. బీసీలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగంలో తగిన ప్రాధాన్యత లభించడం లేదని ఆయన ఎంతో ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాండూరు శ్రీనివాస్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ ఆచార్య భాగయ్య తదితరులు పాల్గొన్నారు.